


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కొన్ని కులాసా కబుర్లు

# భూలోక దేవతలు

అమెరికాలో ఐదు వారాలు ఉండి ఎవరింటికెళ్ళినా వాళ్ళు అంట్లు తోముకోవడాలు చూసీ చూసీ, ఇంటికిరాగానే మా వరాలుని చూస్తే కౌగిలించుకుని, దాన్ని ముద్దులు పెట్టుకోవాలనిపించింది!

పనిమనుషులూ, పనికిరాని మనుషులూ అని మనుషుల్లో రెండు రకాలు! మొదటి రకం మనకోసం భగవంతుడు అమృతం, కల్పవృక్షం, కామధేనువుతో బాటు సృష్టించాడు. వాళ్ళే పనిమనుషులు.

యాభై రూపాయలు పెంచమని అడిగినందుకో, వారానికి ఓ రోజు 'డుమ్మా' కొట్టినందుకో వాళ్ళని మనం రైట్ రాయల్ గా మాటలు అనేస్తాం, చద్ది అన్నాలిస్తాం. వాళ్ళు మన ముందే డస్ట్‌బిన్‌లో పడేసి పోతే మూతి తిప్పి సాధిస్తాం. పాత చీరలిస్తాం. అది వాటిని చింపి ఇల్లు తుడుస్తోందని తెలిస్తే తెగ మధన పడిపోతాం. నేను వేళా పాళా లేకుండా బంధువుల్నీ, ఫ్రెండ్స్‌నీ ఇంటికి పిలిస్తే అది సింక్ నిండా ఉన్న అంట్లు, మాటమాట్లాడకుండా తోముతుంది. ఎంగిలి కాఫీ గ్లాసులూ, ప్లేట్లూ నవ్వుతూ తీస్తుంది. ఎటొచ్చీ కొన్నిసార్లు అలుగుతుంది. చెప్పా పెట్టకుండా సినిమాకెళ్ళిపోయి పిల్ల చేత ఆస్పత్రికెళ్ళానని కబురు చేస్తుంది. ఆ విషయం దాని ఖర్మకాలి ఏ పక్కింటావిడ వల్లో బట్టబయలు అవుతుంది. దాంతో దాన్ని నేను సి.బి.ఐ ఆఫీసర్‌లా నిలదీస్తాను. తలగోక్కుంటూ ఓ నవ్వు నవ్వి "సిరంజీవి సినీమా అమ్మా... అందులో హీరోయిన్ కట్టిన సీర మీకైతే ఇంకా సూపర్‌గా ఉంటుంది" అని నన్ను ఈజీగా బుట్టలో వేసెయ్యడం దానికి తెలుసు!

బోధి చెట్టు కింద కూర్చున్నప్పుడు సిద్ధార్థుడికి జ్ఞానోదయం అయినట్లు నాకు అమెరికా యాత్రలో భారతదేశంలో మేం భూలోక దేవతలకి చేస్తున్న ద్రోహాల గురించి జ్ఞానోదయం అయింది!

ఒకనాడు మావారు పేపర్ చూస్తూ 'కెవ్వు'మని అరిచారు. "ఏవిటీ? ఇంటి కప్పు కూలిందా?" అని వంటింట్లోంచి గరిటతో పరిగెత్తుకొచ్చాను. "పనిమనుషులకి వేతనాలు ఎలా ఇవ్వాలో గవర్నమెంట్ రూల్ పాస్ చేసింది" అని జీతం, వాళ్ళ సెలవల వివరాలూ ఉన్నాయి. మా వరాలుకి చదువురాదు కాబట్టి సరిపోయింది కానీ ప్రజల్ని ఎడ్యుకేట్ చెయ్యడానికి పుట్టిన అపర గిరీశం మా ఆయన. "వరాలూ" అని కేకేసి "పేపర్లో ఏం వచ్చిందో తెలుసా?" అని మొదలెట్టేసారు.

నేను... "ఉష్. ష్. పాడు ఎలకలు... వరాలూ సిలిండర్ వెనకాలకి ఎలుక వెళ్ళింది చూడూ" అంటూ వరాలుని టైంకి అక్కడినుండి అవతలకి పంపించాను. అమ్మో లేకపోతే ఇంకేమైనా ఉందా? మా అభినవ గిరీశంగారి వల్ల నేను నెలకి పదిహేనువందల జీతం, ఆదివారాలూ, పండగలనాడూ శలవలూ, ఏడాదికోసారి బోనస్, ప్రతి సంవత్సరం ఇంక్రిమెంటూ, ప్రావిడెంట్ ఫండూ... రిటైర్మెంటు బెనిఫిట్సూ... ఇవన్నీ దానికి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడేది!

వరాలుకైనా మరో ముత్యాలకైనా ఎవరికైనా సరే చిన్న చిన రాయితీలు మనం ఇచ్చెయ్యాలి. మనం ఎంతో ముచ్చట పడి కొనుక్కున్న బుజ్జిముండ చిన్న స్టీలు గిన్నీ, మూతా కనపడకపోయినా. అప్పుడప్పుడూ చెమ్చాలూ, గ్లాసులూ మాయం అయినా, దానికి అమ్ముకోవాలి అనిపించినప్పుడల్లా మన మగ్గులూ, బక్కెట్లూ విరిగిపోయినా, న్యూస్ పేపర్లు అమ్మేవాడితో కుమ్మక్కు అయినా, బట్టలకి రంగులు అంటి, ఆ చీర ఇంకెందుకూ పనికిరాక దానికి ఇచ్చెయ్యాల్సొచ్చినా... ముగ్గు డబ్బా పదిహేను రోజులు వచ్చేది వారానికే ఖర్చు అయిపోయినా, సబ్బులూ, సర్ఫూ త్వరగా ఖర్చు అయిపోయినా.. మనం వెలితి పడి అడగకూడదు! ఆఫ్టాల్... వరాలూ మనింట్లో ఒక మెంబరు. చుట్టాలొస్తే ఆపాటి ఖర్చు చెయ్యమా!

అయినా ఏమనిషికయినా దురాశ పుట్టడం, మానడం మన చేతుల్లోనే ఉంటుంది. మా ఇంట్లో మా పిల్లల చిన్నతనంలో సుశీల అనే పనమ్మాయి ఉండేది. దాని పేరు చూసి, నమ్మి, సర్వస్వం దానికి అప్పచెప్పేదాన్ని. దానికి అపరిమితమైన షోకు! ఇద్దరం కలిసి సినిమా ఫంక్షన్స్‌కి వెళితే ఎవరు పనమ్మాయో తెలిసేదికాదు! దానికి గ్యాస్ స్టౌవ్ కొనిపెట్టాను, మిక్సర్ కొనిపెట్టాను, కుక్కర్ కొనిపెట్టాను.... కానీ ఇంకొక్కటి అది మనసు పడుతోందని గ్రహించలేక కొనలేదు. అది మా అమ్మ చంద్రహారం!

ఒకనాడు మా హడావిడిలో మేం ఉండగా అది దాన్ని కొట్టేసింది. మేం ఆ సందులో వున్న ప్రతి ఒక్కరినీ అనుమానించాం. కానీ సుశీలని మాత్రం అనుమానించలేదు! మా అమ్మ "మూడు తులాల చంద్రహారం... రిటైర్మెంట్ డబ్బుతో కొనుక్కున్నానే!" అని అన్నం నీళ్ళూ మానేసింది. నాకూ బాధగానే ఉంది! కానీ ఇంటి దొంగని ఈశ్వరుడైన పట్టలేడు అన్నట్లు ఊరుకున్నాం. కానీ మా అమ్మ నమ్మిన ఆ సాయీశ్వరుడూ ఊరుకోలేదు. మళ్ళీ ఫస్ట్ తారీఖునాడు సుశీలకి పాడు బుద్ధి పుట్టించాడు! అది ఈసారి అమ్మ పర్సులోంచి వెయ్యిరూపాయిలు కొట్టేసి దేవుడి పీట కింద దాచేసింది! మా అమ్మ ఓ గంట తర్వాత పర్సులో చూసి "సుశీలా ఇందులో ఓ వెయ్యి తక్కువ ఉంది" అంది.

"నీకు మతిపోయింది చంద్రహారం పోయినప్పటినుండీ" అంది అంట్లు తోముతూ సుశీల.

"కాదు! ఇప్పటిదాకా ఉన్నాయి" అని మా అమ్మ గట్టిగా అనగానే

"చూడు! దేవుడి పీట కింద పారేసుకుని నన్ను అడుగుతున్నావు" అని తీసిచ్చింది.

మా అమ్మకి దాంతో చంద్రహారం కూడా దీని పనే అని అనుమానం వచ్చేసింది. అప్పుడేమీ మాట్లాడకుండా నా దగ్గరకి వచ్చి తన అనుమానం సంగతి చెప్పింది. నేనూ వెంటనే రియాక్ట్ అవలేదు. కేర్‌ఫుల్‌గా స్కీన్ప్లే చేసుకున్నాను.

మధ్యాహ్నం మా అమ్మతో "సుశీల ఇంటికెళదాం పద" అని ఫ్రిజ్‌లోంచి ఒక నిమ్మకాయ తీసుకున్నాను.

"నిమ్మకాయ ఎందుకే?" అంది అమ్మ.

"చెపుతా పద" అన్నాను.

ఇద్దరం సుశీల ఇంటికి వెళ్ళాం. వంట చేసుకుంటుంది. మమ్మల్ని చూసి తెల్లబోయింది.

"రండి.. ఇలా వచ్చారేంటి?" అంది.

నేను అటూ ఇటూ చూసి "సుశీలా... మగడం పల్లి బాబా సంగతి తెలుసుగా! ఆయనకి మా అమ్మ చంద్రహారం సంగతి తెలిసి ఈ నిమ్మకాయ పంపించారు. ఇది మాకు అనుమానం ఉన్న వాళ్ళ ఇంట్లో పెడితే ఆ ఇంటిల్లిపాదీ రక్తం కక్కుకుని చస్తారట...." అని మంచం మీద పెట్టాను.

"అయ్యో.. అయ్యో... తియ్యమ్మా... మా ఇంట్లో పెడతావేం... నా మీద అనుమానమా?" అంది.

"అబ్బా! దొంగతనం చేసినవాళ్ళ ఇంట్లో వాళ్ళే రక్తం కక్కుకుని చస్తారే. మిగతా వాళ్ళకేం కాదు!" అన్నాను.

"అయినా సరే! ఎందుకొచ్చింది.." అంది.

"ఇంకా మేం ఎవరిళ్ళకీ వెళ్ళలేదు! నువ్వూ వస్తావేమోనని అడగడానికొచ్చాను" అన్నాను.

"ఇంకా వంటకాలేదమ్మా... రాను!" అంది

"సరే ... పదమ్మా" అని అమ్మతో ఇంటికొచ్చేశాము.

"అదేమిటే... దాన్ని నిలదియ్యలేదూ..." అని అమ్మ ఏదో అంటోంది.

"నువ్వెళ్ళు.. గంటలో నీ చంద్రహారం నీకొస్తుంది" అని నేను ముసుగు పెట్టి పెడుకున్నాను.

. సుశీల ఓ గంటలోగానే శోకాలు పెడుతూ వచ్చి" నీ బిడ్డకి నా మీద అనుమానమా... నా ఇంటికొచ్చింది... నువ్వే ఎక్కడో నీ చంద్రహారం పారేసుకుని నన్ను అంటున్నావు.." అంటూ రాద్ధాంతం చేసి స్పృహ తప్పి పడిపోయినట్లు చేసిందట. అమ్మ లోపలకెళ్ళి మంచినీళ్ళు తెస్తూ చూసిందట. అది తన జాకెట్టులోంచి చంద్రహారం తీసి పరుపు చింపి అందులో వెయ్యడం! అమ్మ రాగానే "ఇదిగో... నీ పరుపులోనే ఉంది... అందరినీ అనుమానించావు" అని తీసి ఇచ్చిందట.

అమ్మా, సుశీలా వచ్చారు. నాకు అది తన వర్షన్ చెప్పింది. అదెళ్ళాకా అమ్మ తను చూసింది చెప్పింది" నీ సొమ్ము గట్టిది. భద్రంగా దాచుకో" అన్నాను. మర్నాడు సుశీల పనికి వస్తే "ఇంక రాకు!" అన్నాను దానికీ అర్థం అయి ఏడుస్తూ వెళ్ళిపోయింది.

జరిగినదాంట్లో నా తప్పూ ఉందని నేను ఫీల్ అవుతాను. సుశీలకి ఇంట్లో బోలెడు స్వతంత్రం ఇచ్చాను. ఎక్కడికయినా నాతో తీసుకెళ్ళాను. మా ఇంట్లో తిరుగుతూ, నా చీరల్లాంటివి కట్టూకుంటూ, నా లైఫ్ స్టైల్‌న్నే ఫాలో అవుతూ.... ఆ చిన్న ప్రలోభానికి గురయిందేమో .. వస్తువులు నిర్లక్ష్యంగా పెట్టుకుని దాన్ని దొంగని చేసానేమో అనే గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది!

ఏది ఏమైనా ... పనిమనుషులు లేని జీవితం నేను ఊహించలేను! వరాలుకి జ్వరం వస్తే పక్క వాచ్‌మేన్ భార్యనో... పక్కింటావిడ పనిమనిషినో డెయిలీ వేజెస్ మీద వెంటనే తీసేసుకుంటాను... వాళ్ళూ కుదరకపోతే ఫ్రెండ్స్ అందరికీ నెంబర్లు తిప్పి గబగబా ఫోన్లు చేసి వాళ్ళ పనిమనుషుల్ని అప్పుతీసుకుంటాను!

అమెరికాలో కార్లలో వచ్చి పనిచేసుకుని పోయే టిప్‌టాప్ క్లీనర్లతో ఇంటి యజమానురాళ్ళు ఎంత మర్యాదగా మాట్లాడతారో చూసాకా నేనూ వరాలుని ఇంకా గౌరవంగా చూస్తున్నాను. కానీ అమెరికాలో ఒక ఇల్లాలు, పనిమనిషి లేదు కదా అని గిన్నెలు కడిగి సాయం చేస్తుంటే, ఫోన్‌లో ఎవరితోటో "మా ఇంట్లో ఇవాళ ఇద్దరు క్లీనర్స్ ఉన్నారు" అని నన్నూ, నా ఫ్రెండ్‌నీ రిఫర్ చెయ్యడం విని తెల్లబోయాను. పనిమనుషులతో పోల్చినందుకు కాదు! మేం వింటున్నాం అని ఆవిడ పట్టించుకోనందుకు! ఫర్వాలేదు లెండి... పనిమనుషులతో పోల్చొచ్చు! పనికిరాని మనుషులుంటారు కొందరు... వాళ్ళతో పోల్చకూడదు!